


# కరపత్రం

SINCE 2014

గురువారం ఫిబ్రవరి 12, 2026 సంపుటి : 2 సంచిక : 127 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## ఓటేసిన పలువురు ప్రముఖులు

» కొడంగ్‌లో ఓటేసిన సిఎం రేవంత్ » మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క



**హైదరాబాద్,ఫిబ్రవరి11**
మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

## ఎన్నికల కమిషన్ నిర్ణయం.. జగ్గారెడ్డి రియాక్షన్



సంగారెడ్డి: మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యలపై స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.. కేసు నమోదు చేసి.. రిపోర్ట్ ఇవ్వాలని ఎస్పీని ఎస్ఈసీ ఆదేశించింది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నిర్ణయంపై జగ్గారెడ్డి స్పందిస్తూ.. ఇప్పుడే తానూ మీడియాలో చూశానని సంగారెడ్డిలో జరిగిన గొడవపై ఎన్నికల కమిషన్ స్పందించిందన్నారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొంగ ఓట్లు నమోదయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను తెచ్చి అప్పుడు సంగారెడ్డిలో ఓటర్లుగా నమోదు చేశారు. ఒక్కో వార్డులో 300లకు పైగా దొంగ ఓట్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేర్చారు. అప్పుడు నమోదు చేసుకున్న దొంగ ఓట్లు నేడు మున్సిపల్ ఎన్నికల్లో వేస్తున్నారు. దొంగ ఓట్లు వేయకుండా కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. అలా అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్త గల్లాను సీఐ శివ కుమార్ పట్టుకున్నారు.. దీంతో నేను అక్కడికి వెళ్ళాను.. గొడవ జరిగింది" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.మరి ఎలక్షన్ కమిషన్ ఆ దొంగ ఓట్లను ఎందుకు తొలగించలేదు. ఈ గొడవ జరగడానికి ఎన్నికల కమిషన్, జిల్లా అధికారులు బాధ్యులు కారా?. ఈ విషయానికి కూడా ఎన్నికల కమిషన్ జవాబు చెప్పాలి. దొంగ ఓట్లు తొలగించడంలో ఎన్నికల కమిషన్, అధికారులు విఫలమై.. దొంగ ఓటర్లను అడ్డుకున్న మాపై కేసులు పెట్టమని ఎన్నికల కమిషన్ చెప్పడం కరెక్టా?" అంటూ జగ్గారెడ్డి ప్రశ్నించారు.

## అంబటి రాంబాబును వెన్నాడుతున్న కేసులు

- అక్కీ డ్రా కేసులో పిటి వారెంట్ జారీ
- బెయిల్ దక్కినా విడుదలో మరింత ఆలస్యం

**గుంటూరు,ఫిబ్రవరి11 :**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసుల పరంపర కొనసాగుతోంది.. అంబటిపై మరో పీటీ వారెంట్ జారీ చేయబడింది.



2 లో



## అసెంబ్లీలో సబ్జెక్టుపై అవగాహనతో రావాలి

» ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు
» ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే
» ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు సూచన

**అమరావతి,ఫిబ్రవరి11:**
వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్దంగా ఉండాలన్నారు. సబ్జెక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని స్జబెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్ధిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం. కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు' అని చంద్రబాబు అన్నారు.

మిగతాది 2 లో



## మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

» 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు
» శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు

**హైదరాబాద్,ఫిబ్రవరి11 :**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది.

2లో..




2 లో

## ఓటు వేసిన మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

» ఫోన్ ట్యాపింగ్‌పై పొంగులేటి వ్యాఖ్యలపై ఆగ్రహం

**సూర్యాపేట,ఫిబ్రవరి11 :**
తన ఫోన్‌ను బీఆర్ఎస్ నాయకులు ట్యాపింగ్ చేస్తున్నారని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం సూర్యాపేటలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నది వారేనని అయినా హోం మంత్రి చేతకానితనమే దీనికి నిదర్శనమా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని అనడం హాస్యాస్పదమని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు



**హైదరాబాద్:**
మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు.చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.



## కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

» ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్య
» కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ

**కరీంనగర్,ఫిబ్రవరి11 :**
మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు.

మిగతాది 2 లో

## 10 మంది ఐఏఎస్‌ల బదిలీ.. సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్

**హైదరాబాద్:**
తెలంగాణలో 10 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్ నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ బాధ్యతలు చేపట్టనున్నారు. గిరిజన సంక్షేమ ప్రత్యేక సీఎస్‌గానూ ఆయన కొనసాగనున్నారు. పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్యకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా కాత్యాయనీ దేవి బదిలీ అయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. జలమండలి జేఎండీగా మయాంక్ మిట్టల్ నియమితులయ్యారు. పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ్‌శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్‌డీగా అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు.

## హైదరాబాద్ నగర చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది

» నగర చరిత్రలో ముగిసిందొక అధ్యాయం
» రూపురేఖలు మారిన జీహెచ్‌ఎంసీ

**హైదరాబాద్:**
హైదరాబాద్ నగర చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. 2007 ఏప్రిల్ 16న శివార్లలోని 12 మున్సిపాలిటీల విలీనంతో 150 వార్డులుగా ఏర్పాటైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) రూపురేఖలు బుధవారం (2026 ఫిబ్రవరి11) నుంచి మారిపోతున్నాయి.



మిగతాది 2లో

# కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమిపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.

## మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మొదటిపేజీ తరువాయి

భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది.

శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను లిలిలి.బిణబసబిఇ-శిబీబ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## ఓటు వేసిన మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని మంత్రి పొంగులేటి అనడం అంటే తమది దద్దమ్మ ప్రభుత్వం అని వారు ఒప్పుకున్నట్లేనని, రాష్ట్రంలో పోలీసింగ్ లేదని, ప్రభుత్వం చేతగాని స్థితిలో ఉందని వారి మాటల్లోనే తేటతెల్లమవుతోందని విమర్శించారు. హోం మంత్రిగా ఉన్న వ్యక్తి విఫలమయ్యారని మంత్రులే పరోక్షంగా ఒప్పుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు స్వేచ్ఛ లేకుండా పోయిందని జగదీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తల్లా వాడుకుంటూ బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని,ఖఆర్ఎస్ ఫోన్ల ట్యాపింగ్ చేస్తోందనేదనేది కేవలం అపోహ మాత్రమేనని, నిజానికి మంత్రుల ఫోన్లను కూడా ఈ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని మేము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామన్నారు. నిజంగా ట్యాపింగ్ జరుగుతుంటే, అది ఎవరో తేల్చే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో సహకరించాలని ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం వారి బలహీనతకు నిదర్శనమన్నారు. ప్రజల్లో ఆదరణ లేక ఇప్పుడు ఉద్యోగుల వద్దకు కాళ్ల బేరానికి వెళు్తన్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని దాడులు చేసినా రాబోయేది మళ్లీ కేసీఆర్ రాజ్యమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అంబటి రాంబాబును వెన్నాడుతున్న కేసులు

మొదటిపేజీ తరువాయి

సత్తెనపల్లి పోలీసులు నేడు ఆయనను కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ పీటీ వారెంట్ 2023లో సత్తెనపల్లిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల లక్కీ డ్రా లాటరీకి సంబంధించి జారీ చేశారు. పింఛన్ లబ్ధిదారులలో 200 మందిని మినహాయించి, ఇతరులకు లక్కీ డ్రా టిక్కెట్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయని గాదె వెంకటేశ్వర రావు, జనసేన జిల్లా అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. గతంలో వైద్యకళాశాలల ప్రైవేటీకరణ విధానంపై ఆందోళన కేసులో అంబటికి బెయిల్ మంజూరు అయినప్పటికీ, ఈ కొత్త పీటీ వారెంట్ ద్వారా ఆయనపై మరింత విచారణ కొనసాగుతుంది. మున్సిపల్ సివిల్ కోర్టు ఈ వారెంట్ జారీ చేసింది. సత్తెనపల్లి పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు అంబటిని హాజరుపరచనున్నారు, తద్వారా ఆయన విడుదల మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది. గుంటూరు ప్రిన్సిపల్ సబ్ కోర్టులో సత్తెనపల్లి పోలీసులు పీటీ వారెంట్ వేశారు. సత్తెనపల్లిలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో అంబటి వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అంబటి నేతృత్వంలో లక్కీ డ్రా పేరుతో లాటరీ టికెట్ల విక్రయాలు జరిగాయి. సచివాలయ వలంటీర్స్ ద్వారా ఈ టికెట్ల అమ్మకాలు జరిగాయి. 2023లో సంక్రాంతి లక్కీ డ్రా లాటరీ టికెట్లు అమ్మకాలపై సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు సబ్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో అంబటి రాంబాబుపై 2023 జనవరి 16న సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ లక్కీ డ్రా కేసులో తాజాగా పీటీ వారెంట్ జారీ అయింది. మూడు రోజుల క్రితం కూడా అంబటి రాంబాబుకు సంబంధించిన కేసులో పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గతేడాది నవంబర్ 12న మెడికల్ కాలేజీల పీపీపీ మోడల్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన అంబటి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని వెళ్లారు. ఈ ఘటనపై అప్పట్లోనే పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయంపై కేసు దర్యాప్తు జరుగుతోందని పోలీసులు పీటీ వారెంట్లో ప్రస్తావించారు.

## అసెంబ్లీలో జగన్‌ను కలిసిన దువ్వాడ
### తరవాత మాట్లాడుదామిన చెప్పిన వైకాపా నేత

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఏపీ అసెంబ్లీలో వైసీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైఎస్ జగన్‌కు దువ్వాడ ఎదురుపడ్డారు. అసెంబ్లీ నుంచి బయటకు వచ్చే సమయంలో జగన్‌ను దువ్వాడ కలిశారు. దువ్వాడను చూసిన జగన్.. స్నేహపూర్వకంగా 'ఏం చేద్దాం శ్రీనివాస్?' అంటూ పలకరించారు. ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని దువ్వాడ అభ్యర్థించారు. సమగ్రంగా చర్చించేందుకు తాడేపల్లిలోని తన నివాసానికి రావాలని దువ్వాడను జగన్ ఆహ్వానించారు. వైసీపీ నుంచి సస్పెండ్ చేసినా సమావేశాల సమయంలో అసెంబ్లీకి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వస్తున్నారు. గతంలో ఆయనపై వచ్చిన వివాదాల నేపథ్యంలో ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. తాజాగా అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చే సమయంలో వైఎస్ జగన్‌ను దువ్వాడ కలిశారు. ప్రస్తుత పరిణామాలను జగన్‌కు వివరించే ప్రయత్నం చేయగా.. తర్వాత మాట్లాడదాం అంటూ మాజీ సీఎం వెళ్లిపోయారు. మండలిలో ప్రజా సమస్యలపై వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్లే ఆలోచనలో దువ్వాడ ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో వైఎస్ జగన్‌ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే సొంతగా పోటీ చేసి బలం చూపిస్తా అని దువ్వాడ శ్రీనివాస్ చెప్పారు. మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ? 'మండలిలో ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తా. వైఎస్ జగన్‌ను త్వరలోనే కలుస్తాను. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతాను. మెడికల్ కాలేజీలని పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదు. జగన్ అవకాశం ఇవ్వకపోతే.. సొంతగా పోటీ చేసి నా బలం చూపిస్తాను' అని చెప్పారు.

## నలుగురు మంత్రులకు బెదిరింపు లేఖలు

**ఒకే తరహాలో ఉన్న లేఖల సారాంశం**
**పోలీసులకు ఫిర్యాదు చేసిన కందుల దుర్గేశ్ పిఎస్**

ఆంధ్రప్రదేశ్‌లో కొందరు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి హెచ్చరికలతో కూడిన లేఖలు రావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జాగ్రత్తగా ఉండాలంటూ పంపిన ఈ లేఖలపై భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఇప్పటికే మంత్రి కందుల దుర్గేష్ పీఎస్.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌లకు కూడా ఇదే తరహా హెచ్చరిక లేఖలు అందాయి. ఒకే విధమైన సందేశంతో పలువురు మంత్రులకు లేఖలు రావడం వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లేఖపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ లేఖల వ్యవహారం అసెంబ్లీ లాబీల్లో విస్తృత చర్చకు దారి తీసింది. హెచ్చరిక లేఖల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ప్రభుత్వం మరింత జాగ్రత్తలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కందుల దుర్గేష్ మాట్లాడుతూ? 'మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నాకు చాలా మంది ఫోన్లు చేశారు. నేను పనిచేసేది టూరిజం లాంటి చిన్న శాఖ. దీంట్లో మావోయిస్టులు లేక రాయాల్సినంత పెద్ద హడావిడి ఏముంటుంది. వ్యక్తిగతంగా, శాఖ పరంగా ఎక్కడ ఎలాంటి తప్పులు ఉండవు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారు. మావోయిస్టులు లేఖలు ఇలా ఉండవు కదా?' అని అన్నారు.

## గవర్నర్ ప్రసంగం అడ్డుకునే యత్నం
### సబలో నినాదాలు చేస్తూ వైసిపి వాకౌట్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు బుధవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం అయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. సభ నుంచి వాకౌట్ చేశారు. లడ్డు కల్తీ ఆరోపణలు, నిరుద్యోగ భృతి అంశం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వంటి విషయాలపై ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సభలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ సభ్యుల నినాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. కొందరు సభ్యులు స్పీకర్ చైర్ వైపు పేపర్లు విసిరి నిరసన వ్యక్తం చేశారు. సభలో క్రమశిక్షణ పాటించాలంటూ స్పీకర్ సూచించినప్పటికీ.. వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. అనంతరం సభను బహిష్కరిస్తూ వాకౌట్ చేశారు. ఈ సంఘటనతో అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. ప్రభుత్వ-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## హైదరాబాద్ నగర చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది

మొదటిపేజీ తరువాయి

జీహెచ్ఎంసీగానే 300 వార్డులకు విస్తరించి మహా కార్పొరేషన్‌గా అవతరించిన జీహెచ్ఎంసీ.. తిరిగి 150 వార్డులతోనే అయినప్పటికీ కొత్త రూపుతో కనిపించనుంది. అటు తొర్రూరు నుంచి ఇటు అడ్డగుట్ట దాకా విస్తరించినప్పటికీ, వనస్థలిపురం, పెద్దఅంబర్‌పేట, కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ వంటి ప్రాంతాలను వదులుకోవాల్సి వచ్చింది. అవి కొత్తగా ఏర్పాటైన రెండు కార్పొరేషన్లలో కనిపించనున్నాయి. 5 జోన్లుగా అవతరించిన జీహెచ్ఎంసీ అనంతరం 6 జోన్లుగా మారింది. తిరిగి 12 జోన్లకు విస్తరించిన పరిధి మళ్లీ 6 జోన్లకు పరిమితమైంది.

**అలా.. మారిన నగరం.. అభివృద్ధి ఘనం..**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏర్పడిన జీహెచ్ఎంసీ.. తిరిగి కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే రూపురేఖలు మార్చుకుంది. గడచిన పుష్కర కాలంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎన్నో పనులు జరిగాయి. విదేశాలను తలపించేలా బహుళ అంతస్తుల భవనాలు, ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. బీఆర్ఎస్ హయాంలో ఎస్సార్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం), ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) కింద వేల కోట్ల పనులు జరిగాయి. దాదాపు రూ.24వేల కోట్లతో 23 ఫ్లై ఓవర్లతో సహ దాదాపు 40 ప్రాజెక్టుల పనులు జరిగాయి. బాండ్ల ద్వారానూ రుణాలు సేకరించిన కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ పేరు తెచ్చుకుంది. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పార్కుల ఏర్పాటు, పచ్చదనం, సుందరీకరణ వంటి పనులు జరిగాయి. నిర్వహణ తీరెలా ఉన్నా ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్స్ వంటివి ఏర్పాటు చేశారు. దేశంలోని అగ్రనగరాలతో పోటీ పడుతూ నగరం ఎదిగేలా జీహెచ్ఎంసీ తనవంతు పాత్ర నిర్వహించింది.

## బోధన్‌లో దొంగ ఓట్లేసేందుకు యత్నం

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చి పట్టుబడ్డారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం రాకసిపేట గోశాలలో దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. బూత్ నెంబర్ 24, 78 లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీనితో బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని అరీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఓఎఓ రెండు పార్టీల కార్యకర్తలు గుమ్మిగూడారు. ఒక్కసారిగా పరస్పర నినాదాలు చేపట్టారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.

## సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు
### ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సైబరాబాద్ సీపీ వెంట డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్ విభజన సరైనదే

**- స్వాగతించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ని తెలంగాణ ప్రభుత్వం మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్‌ను మూడు డివిజన్లుగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. 'గ్రేటర్ హైదరాబాద్ ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా నగరానికి మంచి జరగబోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.. ఇది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయం కాదు. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, విపక్షాల అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రాంతీయ కార్యాలయంలో నేరుగా సమస్యలు పరిష్కారం అవుతాయి. బీఆర్ఎస్ రాజకీయం కోసం మాట్లాడుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్న రోజుల్లో ఏమీ పట్టించుకోలేదు. రాజకీయాల కోసం ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వేగవంతమైన అభివృద్ధికి ఈ నిర్ణయం గొప్ప ఊతమిస్తుంది. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయం.. దీన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా' అని అన్నారు.

## ఎమ్మెల్యే భార్య స్టోర్‌లో చోరీ

**- స్టోర్ ఉద్యోగి పనే అని గుర్తించిన పోలీసులు**

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సతీమణి అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్న డిజైనర్ స్టోర్‌లో జరిగిన చోరీ కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ డిజైనర్ స్టోర్‌ను అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈనెల 6న ఆ స్టోర్‌లో ఓ చోరీ జరిగింది. ఈ స్టోర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అమీనుల్ హక్(38) ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన ఈ నిందితుడు కొన్ని నెలలుగా స్టోర్‌లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రివేళ పక్కా ప్రణాళికతో స్టోర్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా కిటికీ గుండా లోపలికి వెళ్లాడు. అక్కడ స్క్రూడ్రైవర్ సాయంతో లాకర్ తెరిచి రూ.2.43 లక్షల నగదును చోరీ చేశాడు. దోచుకెళ్లిన ఆ సొమ్మును తన ఇంట్లోని డస్ట్‌బిన్‌లో దాచాడు. మరుసటి రోజు ఉదయాన్నే డ్యూటీకి వచ్చిన అమీనుల్ హక్.. స్టోర్‌లో దొంగలు పడ్డారంటూ హడావుడి చేశాడు. సీసీటీవీ కెమెరాల్లో స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. కిటికీ వద్ద లభించిన బూట్ల ముద్రలు కీలక ఆధారంగా నిలిచాయి. ఆ షూస్ ముద్రలు పూర్తిగా మ్యాచ్ కావడంతో అమీనుల్ హక్ గుట్టు రట్టయ్యింది. విచారణలో చోరీ చేసినట్లు అమీనుల్ హక్ అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు.. అతడి నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## థాయి స్కూల్‌లో నరమేధం
### దుండగుడి కాల్పుల్లో 34మంది హతం

**- మృతుల్లో 22మంది చిన్నారులు**

దక్షిణ థాయిలాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అయితే తరవాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమచారం.

## నరవణెళి పుస్తక వివాదం

భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుందే నరవణెళి రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం విడుదలకు ముందే సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతుండటం వివాదాస్పదమవుతోంది. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు తాజాగా పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియాకు నోటీసులు పంపారు. ప్రచురితం కాని పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలు సంధిస్తూ వాటికి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.నరవణెళి పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదంపై పెంగ్విన్ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు సామాజిక మాధ్యమాల్లో వివరణ ఇచ్చింది. ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని తొలుత పేర్కొంది. విడుదల కాబోతోన్న పుస్తకం, ప్రీ ఆర్డర్‌కు అందుబాటులో ఉన్న పుస్తకం, పబ్లిష్డ్ పుస్తకం ఒకటి కాదని మార్కెట్లో అన్ని చోట్ల అందుబాటులోకి వచ్చినప్పుడే పబ్లిష్డ్‌గా పరిగణించాలని రెండోసారి వివరణలో పేర్కొంది. నరవణెళి పుస్తకానికి సంబంధించి వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రస్తావించడం వివాదానికి కారణమైంది. రాహుల్ చర్చలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకుంటూ ఇంకా విడుదల కాని పుస్తకం గురించి ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. పుస్తకానికి రక్షణ శాఖ అనుమతి అవసరం. అయితే అనుమతి ఇవ్వలేదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ గత వారం ఆ పుస్తకాన్ని పార్లమెంటు వెలుపల ప్రదర్శించడంతో వివాదం ముదిరింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఫిబ్రవరి 12, 2026

# తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీకి పట్టం కట్టే విధంగానే మున్సిపల్ ఎన్నికలు...!!!

- అధికారం ఉన్న పార్టీలకే ఓటు వేస్తు గెలిపించే విధంగానే ఓటర్లు...???
- నోటు కే ఓటు అనే విధంగానే ఓటర్ల తీరు...!!!
- అధికారం ఉన్న పార్టీకి ఓటు వేసే మనస్తత్వం గల ఓటరు...!!!

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట, ఫిబ్రవరి 11**
తెలంగాణ రాష్ట్రంలో బుధవారం జరిగినటువంటి మున్సిపల్ ఎన్నికలు.ఎగ్జిట్ పోల్స్ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయం అంచనా దాదాపు 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలునిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీకి, మిగిలిన కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు




ఆధిక్యంఫిబ్రవరి 13న వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠతెలంగాణలో బుధవారం ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం విడుదలైన సర్వేలన్నీ కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైనట్లు ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే ఏకంగా 80-85 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి.
వార్డుల వారీగా చూస్తే, ఆపరేషన్ చాణక్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 1400-1449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745-793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358-399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది. ఆశ్చర్యకరంగా జనసేన పార్టీ 30-35 వార్డులు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొనడం గమనార్హం.ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించవచ్చని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్ష విజయం సాధిస్తుందని తెలిపింది. కొత్తగూడెంలో కాంగ్రెస్‌కు, సీపీఐకి మధ్య గట్టిపోటీ ఉండగా, బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం కావచ్చని సర్వేలు చెబుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ముస్లిం మైనారిటీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.
మొత్తం మీద, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నట్లే. అయితే ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు ఫిబ్రవరి 13న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే వెల్లడవుతాయి. ఈ ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది పలువురు తెలియజేస్తున్నారు

## ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అధికారుల అండ దండలతోనే

- ఇష్టానుసారంగా హల్దీ వాగు నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపణ చేసిన
- నెల్లూరు సర్పంచ్ రంగారెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 11**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం నెల్లూరు హస్తాల్పూర్ గ్రామ శివారులో ఉన్నటువంటి హల్దీ వాగు నుండి అక్రమంగా రవాణా చేస్తున్నారని మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం నెల్లూరు గ్రామ సర్పంచ్ రంగారెడ్డి ఆరోపించారు వారు బుధవారం నాడు జాతీయ భూమి దినపత్రిక ప్రతినిధి పొన్నం ఆంజనేయులు గౌడ్తో చరవాణి ద్వారా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు పది సంవత్సరాల అనంతరం మూడవసారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పేరున నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నిరుపేదలకు ఇల్లు లేని వారికి సొంత స్థలంలో ఇంద్రమ్మ ఇళ్ళను నిర్మిస్తామని ఇచ్చినటువంటి హామీనీ నిర్వహిస్తున్నటువంటి తరుణంలో ఇల్లు కట్టుకోవాలి అంటే ముఖ్యంగా ఇసుక అవసరమేనని అదే చదునుగా చేసుకొని కొందరు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇంద్రమ్మ ఇళ్లకు ఇసుకను సరఫరా చేస్తామని అక్రమార్కులు అక్రమంగా ఇసుకను ఇందిరమ్మ ఇండ్లకు కాకుండా వారి ఇష్టానుసారంగా అక్రమంగా ఉస్కా రవాణాను చేస్తున్నారని వారు ఆరోపించారు బుధవారం నాడు నెల్లూరు గ్రామ శివారులో ఉన్నటువంటి హల్దీ వాగు నుండి పలు గ్రామాల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నటువంటి ట్రాక్టర్లను అడ్డుకున్న ఆయన సంబంధిత అధికారులకు



సమాచారం ఇచ్చిన కూడా ఎటువంటి స్పందన లేకపోవడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు తొత్తులుగా మాట్లాడుతూ అసలు సిసలైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను పంపించకుండా అక్రమంగా ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇసుక రవాణాన్ని చేస్తున్నారని అధికారులను ప్రశ్నించగా పై అధికారుల ఆదేశాల మేరకే ఇసుకకు అనుమతులు ఇస్తున్నామని
సమాధానాన్ని ఇవ్వడం ఎంతవరకు సమంజసమని తమ గ్రామ పంచాయతీ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులు అక్రమంగా ఇతర మండలాలకు అనుమతులు ఇవ్వడంతో తమ గ్రామానికి ఇసుక అవసరం ఉంది అంటే ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు మండిపడ్డారు ఇందిరమ్మ ఇల్లు పత్రాలను చూపించి మాకు అధికారుల నుండి అనుమతులు ఉన్నాయని అక్రమార్కులు ఇసుక రవాణాలను చేయడమే కాకుండా వారిపై దురుసుగా మాట్లాడుతూ ఉన్నారంటే వారికి ఎలాంటి అధికారం ఉంటే తమపై మాట్లాడుతారు అని ఆయన ఆరోపించారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఇలా ఉన్నది అనేది నిదర్శనానికి అక్రమ ఇసుక దందా అని ఆయన తెలియజేశారు ఇకనైనా అసలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక రవణ చేయడం తక్కువ అక్రమంగా అధికారుల అండ దండలతో ఇసుకను అల్ది వాగో నుండి తీసుకువెళ్లడంతో హల్దీ వాగు ఇరుపక్కల ఉన్న పొలాలక
రైతులకు భూగర్భ జలాలు తగ్గడం మే కాకుండా పంటలు పండించుకోవాలంటే హల్దీ వాగులో ఇసుకనే ఉంటే నీటి నిల్వ భూగర్భ జలాలకు అందుతుందని వారు తెలియజేశారు ఇకముందు ఇలాంటి అక్రమ ఇసుక దందాలను మానుకోవాలని లేని పక్షంలో తాము అధికారికంగా అధికారులపై పై అధికారులకు ఫిర్యాదులు చేయడం జరుగుతుందని అధికారులు స్పందించి అక్రమ రవాణా ఇసుకను ఆపివేయాలని ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవడం మే కాకుండా అధికారులపై కూడా తగినటువంటి చర్యలు తీసుకున్న విధంగానే తాము ర్యాలీ ధర్నా రాస్తారోకోలు చేయడం కూడా జరుగుతుందని ఆయన తెలియజేశారు

## ఒక జర్నలిస్ట్ విన్నుత ఆలోచన




- నల్లమలలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం..

**కరపత్రం ప్రతినిధి మన్ననూర్(నల్లమల):**
పర్యావరణ పరిరక్షణ కోసం జర్నలిస్టు జిజి ఫౌండేషన్ ఫౌండర్ చారకొండ బాలకృష్ణ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. నల్లమల గుండా శ్రీశైలం వెళ్లే యాత్రికులు మన్ననూర్ నుంచి దోమల పెంట వరకు ఉన్న అడవి ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం పై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. జిజి ఫౌండేషన్ ద్వారా ప్రతివారం ఒక గ్రామంలో ప్లాస్టిక్ ద్వారా కలిగే నష్టాల గురించి పర్యావరణం విధ్వంసం గురించి ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. నల్లమల హద్దుల్లో ప్లాస్టిక్ వద్దు పర్యావరణం ముందు అనే క్యాప్షన్ తో కొత్త ఆలోచనతో ప్లాస్టిక్ ద్వారా పర్యావరణం చెట్లు జంతువులు ఎలా ధ్వంసం అవుతున్నాయో ప్రచారం చేస్తున్నారు. మరోపక్క ప్లాస్టిక్ నిషేధం ఉన్న ప్రాంతంలో పర్యావరణం పచ్చదనం జల అభివృద్ధి చెందుతుందో వివరిస్తున్నారు. నల్లమల గుండా శ్రీశైలం వెళ్లే యాత్రికులు మన్ననూర్ నుంచి దోమల పెంట వరకు ఉన్న అడవి ప్రాంతంలో పాదయాత్ర శివ స్వాములు వాహనాలలో వెళ్లే భక్తులు ఎక్కడ ప్లాస్టిక్ వేయకుండా చూసేలా చర్యలు చేపట్టారు. ఫౌండేషన్ యొక్క ముఖ్య ఉద్దేశమే ప్లాస్టిక్ నిషేధమని నల్లమలలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించేందుకు తమ సంస్థ పనిచేస్తుందని జి జి ఫౌండేషన్ ఫౌండర్ చారకొండ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి మంత్రాల శ్రీను తెలిపారు. భవిష్యత్తులో నల్లమల పరిసర ప్రాంతాలలోని గ్రామాలలో ప్రజలను ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ పూర్తిగా నిర్వహించే దిశగా ప్రయత్నం ముమ్మరంగా చేస్తామన్నారు. రాజకీయ నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు కూడా భాగస్వాములై తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## మృతుడి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం

**కరపత్రం ప్రతినిధి వీణవంక పిబ్రవరి 11**
మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి పరామర్శ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన విషాదకర సంఘటన గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గ్రామానికి చెందిన ఈర్నాల శ్రీనివాస్ కుమారుడు రాజు (12) మంగళవారం (10-06-2026) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.సమాచారం అందుకున్న మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి వెంటనే స్పందించి, తన అనుచరులతో కలిసి మృతుడి ఇంటికి చేరుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి,



రాజు మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిన్నారి మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.
అనంతరం మేకల ఎల్లారెడ్డి తన వ్యక్తిగతంగా రూ.10,000 (పదివేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. కుటుంబానికి అవసరమైన మరిన్ని సహాయాలు అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో పల్లెర్ల కిరణ్ గుప్తా, మేకల కోమల్ రెడ్డి, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, 9వ వార్డు సభ్యుడు గంధం ప్రశాంత్, యువకులు మరియు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి గ్రామస్థులు సంఘీభావం తెలిపారు.
గ్రామంలో ఈ ఘటనపై తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు ప్రార్థిస్తున్నారు.

## భక్తులకు సులభంగా దర్శన ఏర్పాట్లు

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర



స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి ఐపీఎస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, భక్తుల ఎంట్రీ ఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలను వారు పరిశీలించి, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. వీఐపీ దర్శనాల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, ఈఈ రాజేష్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఓ అన్సర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకీ కృతజ్ఞతలు

-మంత్రి దామోదర్ రాజనర్సింహ

కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి
సంగారెడ్డి జిల్లా ఆందోల్--జోగిపేట మున్సిపల్ పరిధిలో ప్రజాస్వామ్యంలో భాగంగా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకీ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృతజ్ఞతలు తెలియజేశారు. ఓటు వేయడం కేవలం ఒక గుర్తుకే కాదు మన పట్టణ భవిష్యత్తుకి వేసిన నమ్మకపు ముద్ర అన్నారు. రేపటికి మన పిల్లల భవిష్యత్తుకు భరోసా, మన అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదం అని ఆయన



పేర్కొన్నారు. ఎండను, అలసటను లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. మీలో కనిపించిన ప్రజాస్వామ్య స్ఫూర్తి నాకు మరింత బాధ్యతను గుర్తు చేసింది. రానున్న రోజుల్లో ఆందోల్--జోగిపేటను శుభ్రంగా, సురక్షితంగా, అభివృద్ధి పరంగా ముందుండే మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి ఆరోగ్యం, ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి యువకుడికి అవకాశం ఇదే నా సంకల్పం అని స్పష్టం చేశారు. మీరు చూపిన విశ్వాసం నా బలం.
మీ ఆశలు నా బాధ్యత.
మీ అభివృద్ధి నా ధ్యేయమని,
మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగితే ఆందోల్--జోగిపేట అభివృద్ధి కథను కొత్త చరిత్రగా మార్చగలమన్నారు.

## వెబ్ కాస్టింగ్ సెంటర్ ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సెంటర్ ద్వారా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కొనసాగుతుండగా, ఐడీఓసీలోని సెంటర్ ద్వారా పరిశీలించారు. సెంటర్ లోని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పరిశీలనలోఈడీఎం శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జిల్లాలో ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికలు

**– రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటిల పరిధిలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి,అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు.

## భక్తుల కోసం వాట్సాప్ సేవలు

**– రాజన్న ఆలయంలో ప్రారంభించిన ఈవో రమాదేవి**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు మరింత సులభంగా సేవలు అందించేందుకు బుధవారం రాజన్న ఆలయ ఈవో ఎల్ రమాదేవి వాట్సాప్ సేవలను ప్రారంభించారు. భక్తులకు అవసరమైన సమాచారం, సేవలను డిజిటల్ విధానంలో 8736936969 నెంబర్ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దేవాలయానికి సంబంధించిన దర్శనం, సేవల సమయాలు దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్, అన్న ప్రసాదం, రవాణా సదుపాయాలు, ఆసుపత్రి, దివ్యాంగులకు సౌకర్యాలు, తాగునీరు,మరుగుదొడ్లు, కళ్యాణ కట్ట, సమాచారం కేంద్రం, పోలీస్ స్టేషన్ తదితర వివరాలు వాట్సప్ ద్వారా పొందవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జ్ స్థానాచారి నమిలికొండ ఉమేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ శర్మ, ఈఈ రాజేష్, ఆలయ ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పురాణం వంశీ మోహన శర్మ, ఆగమ రావు, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటాం

**– ధిమా వ్యక్తం చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు జగదీశ్వర్**

**కరపత్రం ప్రతినిధి అందోలు**



ఆందోలు–జోగిపేట మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంటుందని బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు జగదీశ్వర్ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగిన పోలింగ్ సరలిపై పార్టీ సీనియర్ నాయకులు జగదీశ్వర్ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 20 వార్డులకు గాను తమ పార్టీ నుండి 14 వార్డులలో అభ్యర్థులను పోటీకి దింపినట్లు తెలిపారు. మరొకరిని సి ఫామ్ తో పోటీలో నిలిపామన్నారు. పేట లో పార్టీ అభ్యర్థుల ప్రచారం సందర్భంగా పట్టణ ప్రజల నుండి మంచి స్పందన లభించిందని అన్నారు. బిజెపి పార్టీ పట్ల పట్టణ ప్రజలు చూపిన ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ పార్టీ అభ్యర్థులకు పుర ఓటర్ల నుండి వచ్చిన స్పందన చూస్తుంటే తక్కువలో తక్కువ 8 నుండి 10 వార్డులను కైవసం చేసుకుంటామని రాష్ట్ర నాయకులు జగదీశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించిన జిల్లా పార్టీ ఇన్చార్జులు, భూత్ ఇన్చార్జులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు రవిశంకర్, చంటి ప్రభువు, బస్వరాజ్, ఆంజనేయులు, మహేందర్, అశోక్, శివచందర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీణవంకలో విషాదం : రేగు పండ్లు తెంపుతూ కాలుజారి బావిలో పడి బాలుడు మృతి

**కరపత్రం ప్రతినిధి వీణవంక ఫిబ్రవరి 11**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. మల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఓ బాలుడు రేగు పండ్లు తెంపే క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడం గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్థానికులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఈర్నాల శ్రీనివాస్ -- శారద దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ కుటుంబానికి ఏకైక కుమారుడైన రాజు (12) ఆరవ తరగతి చదువుతున్నాడు. చదువులో చురుకైన, అందరితో కలిసిమెలసి ఉండే బాలుడిగా గ్రామంలో మంచి పేరు సంపాదించాడు. తల్లిదండ్రుల ఆశలన్నీ అతడిపైనే నిలిచివున్నాయి.

మంగళవారం సాయంత్రం సమయంలో రాజు ఇంటి సమీపంలోని పొలాలవైపు రేగు పండ్లు తెంపేందుకు వెళ్లాడు. అక్కడ ఒక పాత బావి పక్కన ఉన్న రేగు చెట్టుపైకి ఎక్కి పండ్లు తెంపుతున్న సమయంలో అకస్మాత్తుగా కాలుజారి సమతుల్యత కోల్పోయి బావిలో పడిపోయాడు. ఆ బావి చాలా లోతుగా ఉండటంతో





పాటు చుట్టూ రక్షణ గోడ లేకపోవడం ప్రమాదానికి కారణమైందని గ్రామస్తులు చెబుతున్నారు.

సాయంత్రం వరకు రాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, గ్రామస్తులతో కలిసి వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామస్తులు బావి వద్ద అతడి చప్పుళ్లు, చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి బావిలో పరిశీలించగా రాజు మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బావికి రక్షణ గోడ లేకపోవడం, ప్రమాద సూచికలు లేకపోవడం వంటి అంశాలపై విచారణ జరుగుతోంది. రాజు మృతి వార్త గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన రాజు మృతి తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచెత్తింది. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి శారద మూర్ఛపోయినట్లు సమాచారం. గ్రామస్తులు కుటుంబాన్ని ఓదార్చేందుకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. గ్రామంలో పలు బావులు, కుంటలు రక్షణ చర్యలు లేకుండా ఉండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద గోడలు నిర్మించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషాద ఘటనతో మల్లారెడ్డి పల్లి గ్రామం అంతా శోకసంద్రంగా మారింది. పాఠశాలలో రాజు సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా దిగ్భ్రాంతికి గురయ్యారు. బాలుడి ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు ప్రార్థిస్తున్నారు.

# జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

- **సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో పోలింగ్ శాతం 77.70**
- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ 77.70 శాతం నమోదు అయిందని పేర్కొన్నారు.

**పోలింగ్ శాతం..**



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉండగా, 30, 466 పురుషులు, 33,091 మహిళలు, ఇతరులు 05 మొత్తం 63,562 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.55 పోలింగ్ శాతం నమోదు అయింది. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు ఉండగా, 14,801 పురుషులు, 17,070 మహిళలు, ఇతరులు 10 మంది మొత్తం 31,881 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పోలింగ్ శాతం 77.99 నమోదు అయింది. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో కలిపి 1,22,836 మంది ఓటర్లు ఉండగా, 95,443 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా మొత్తం పోలింగ్ శాతం 77.70 నమోదు అయింది. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కుసుమ రామయ్య ఉన్నత పాఠశాల అలాగే సిరిసిల్ల గీతా నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ను, ఓటింగ్ సరళిని సందర్శించి అధికారులతో మాట్లాడారు. అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అలాగే 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వేములవాడ లోని సినారె కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ నగర్ లోని గ్రీన్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలు : సాయంత్రం 5.గంటల వరకు అన్ని బూతుల్లో ఉత్సాహభరిత పోలింగ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 11**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 గంటల వరకు అన్ని బూతుల్లో ప్రశాంతంగా, క్రమబద్ధంగా కొనసాగింది. ఉదయం నుంచే ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణమంతా ఎన్నికల సందడి నెలకొని ప్రజల్లో విశేష ఉత్సాహం కనిపించింది.కొన్ని కేంద్రాల్లో ఉదయం నుంచే క్యూలైన్లు కనిపించాయి. ముఖ్యంగా మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం గమనార్హం. మొదటిసారి ఓటు వేసిన యువ ఓటర్లు ప్రత్యేక ఉత్సాహంతో పాల్గొన్నారు. పలుచోట్ల కుటుంబ సమేతంగా ఓటు వేసేందుకు వచ్చిన దృశ్యాలు కనిపించాయి.

వార్డు వారీగా నమోదైన పోలింగ్ శాతం:



1వ వార్డు -- 85%<br>
2వ వార్డు -- 78%<br>
3వ వార్డు -- 82%<br>
4వ వార్డు -- 80%<br>
5వ వార్డు -- 83%<br>
6వ వార్డు -- 82%<br>
7వ వార్డు -- 88%<br>
8వ వార్డు -- 89%<br>
9వ వార్డు -- 86%<br>
10వ వార్డు -- 81%<br>
11వ వార్డు -- 85%<br>
12వ వార్డు -- 79%<br>
13వ వార్డు -- 80.2%<br>
14వ వార్డు -- 84%<br>
15వ వార్డు -- 86%<br>
16వ వార్డు -- 79%<br>
17వ వార్డు -- 81%<br>
18వ వార్డు -- 83%<br>
19వ వార్డు -- 79%<br>
20వ వార్డు -- 83%<br>
21వ వార్డు -- 81.5%<br>
22వ వార్డు -- 89%<br>
23వ వార్డు -- 88%<br>
24వ వార్డు -- 75%<br>
25వ వార్డు -- 79%<br>
26వ వార్డు -- 83%<br>
27వ వార్డు -- 86%<br>
28వ వార్డు -- 87%<br>
29వ వార్డు -- 79%<br>
30వ వార్డు -- 89%

ముఖ్యంగా 7వ, 8వ, 22వ, 23వ, 30వ వార్డుల్లో అత్యధిక పోలింగ్ నమోదు కావడం విశేషం. ఈ వార్డుల్లో మధ్యాహ్నం తర్వాత కూడా ఓటర్లు క్యూలలో నిలబడి ఓటు హక్కును వినియోగించారు. 24వ వార్డులో మాత్రం పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది.

హుజూరాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లు, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. మొత్తం పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది.

ఎన్నికల అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 30 వార్డుల్లో సుమారు 79 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం పెరగడం పట్టణ ప్రజల రాజకీయ చైతన్యాన్ని ప్రతిబింబిస్తోంది.

పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. జమ్మికుంట పట్టణ రాజకీయ దిశను నిర్ణయించే ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్న ఆసక్తి ప్రజల్లో నెలకొంది.

ప్రజాస్వామ్యానికి జమ్మికుంట ప్రజలు మరోసారి తమ మద్దతును చాటిచెప్పారు. ఇప్పుడు అందరి చూపు ఫలితాలపై నిలిచింది.

## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ఎలాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్,